

సాక్షి అనంతపురం

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



టన్ను చీనీ రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు వేలు పలికాయి.



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.6, నరాసరి రూ.12 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.3°/13.1°
జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. వేకువజామున చలి వాతావరణం, మధ్యాహ్నం వేసవితాపం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

- ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెకింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు జేఎన్‌టీయూ కళాశాలను డీఆర్వో గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెకింపునకు గదులు, బారికేడ్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌కు స్థల కేటాయింపు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు పటిష్టంగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఓట్ల లెక్కింపునకు బల్లలు, ఫెన్సింగ్ తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హరికుమార్, శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవం.. సాయీశ్వర ఉత్సవం



మహాసమాధి చెంత ప్రతిష్ఠించిన సాయీశ్వర లింగం


ప్రశాంతినిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు సాయీశ్వరలింగాన్ని దర్శించి తరించారు. శనివారం సాయంత్రం వేదపండితులు వేదమంత్రోచ్చారణ నడుమ సత్యసాయి పల్లకీ, సాయీశ్వర లింగాల్ని సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక వేదికపై ప్రతిష్ఠింపజేసి ఏకాదశ ద్రవ్యాభిషేకం, మహారుద్రాభిషేక క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుష్పాలు, పవిత్రజలాలు, రుద్రాక్షలతో రుద్రాభిషేకం చేశారు.

'ప్రేమ తరు' యాప్ ఆవిష్కరణ..
సత్యసాయి 100 వ జయంతి వేడుకల నాటికి కోటి మొక్కలను భక్తులతో పాటు ప్రజలకు పంపిణీ చేసి నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి భక్తులు సులభంగా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు పొందేందుకు అనువుగా రూపొందించిన 'సత్యసాయి ప్రేమ తరు' యాప్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌తో కలసి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మోహన్, గ్లోబల్ కౌన్సిల్ సభ్యులు శనివారం ఉదయం ప్రారంభించారు.ప్రశాంతి మందిరం లైవ్ యూట్యూబ్ ఛానల్ విశిష్టతను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు.

లాభం రసభరితం

- చీనీ విక్రయాల్లో దూకుడు..
- రికార్డ్ సృష్టించిన అనంత మార్కెట్‌యార్డ్
- తొలిసారి ఏడాది పొడవునా ఆశాజనకంగా మార్కెట్
- ఈసారి రూ.185 కోట్ల విలువైన 90 వేల టన్నుల అమ్మకం
- చీనీ రైతులకు వెసులుబాటు, మార్కెట్ కమిటీకి భారీ ఆదాయం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చీనీ తోటలు	టన్ను గరిష్ట ధర	టన్ను కనిష్ట ధర
50 వేల హెక్టార్లు	రూ.45 వేలు	రూ.25 వేలు



మార్కెట్‌యార్డులో చీనీ క్రయ విక్రయాలు

మార్కెట్‌యార్డులో చీనీ అమ్మకాలు ఇలా...

ఏడాది	విక్రయం టన్నుల్లో	విలువ రూ.కోట్లలో
2016-17	23,408	48.80
2017-18	59,585	84.32
2018-19	38,395	71.68
2019-20	44,830	74.57
2020-21	53,820	95.22
2021-22	57,192	128.30
2022-23	84,954	184.85

అనంతపురం అగ్రికల్చర్: దేశంలోనే పెద్ద చీనీ మార్కెట్లలో ఒకటిగా పేరుగాంచిన అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో తొలిసారిగా రికార్డు నెలకొల్పింది. ఏడాది (2022-23) పొడవునా ఆశాజనకమైన ధరతో విక్రయాలు కొనసాగాయి. చీనీ మార్కెట్ ప్రారంభమైన 2016 నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఇలాంటి అమ్మకాలు జరగలేదు. ఏటా ఫిబ్రవరిలో మొదలై సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి మార్కెట్‌లో లావాదేవీలు ఆపేయడం పరిపాటిగా జరుగుతోంది. ఎంతలేదన్నా మూడు నెలల పాటు విరామం ఇచ్చేవారు. అయితే ఈసారి మాత్రం రైతులకు మేలు జరిగేలా ఏడాది పొడవునా 'ఈ-నామ్' విధానంలో పారదర్శకంగా చీనీ క్రయ విక్రయాలు చేపట్టడంలో విజయవంతం అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సూట్లు, కమీషన్, ఏజెంట్ వ్యవస్థను నివారించడంతో చీనీ రైతులకు చాలా వరకు మేలు చేకూరింది.

నాణ్యతకు మారుపేరు
ఉమ్మడి అనంతపురం జిల్లా, వైఎస్సార్, కర్నూలు జిల్లాల పరిధిలో పండుతున్న చీనీకి దేశీయంగా మంచి డిమాండ్ ఉన్నందున ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 50 వేల హెక్టార్ల వరకు చీనీ తోటలు విస్తరించాయి. ఇక్కడ పండుతున్న చీనీలో 70 శాతం వరకు రాజస్థాన్, గుజరాత్, హరియాణా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు చెందిన వ్యాపారులు కొందరు నేరుగా తోటలకే వచ్చి, మరికొందరు తమ ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేస్తుంటారు. చాలామంది తోటల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుంటారు. అయితే చిన్న, సన్నకారు రైతులతో పాటు మధ్య మధ్యలో వచ్చే అరకొర పంటను, అలాగే గ్రేడ్-బీ రకం కొనడానికి వ్యాపారులు అనాసక్తి చూపిస్తుంటారు. అలాంటి వారికి అనంతపురం మార్కెట్‌యార్డు చాలా ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఇక్కడ గ్రేడ్-ఏతో పాటు గ్రేడ్-బీ, గ్రేడ్-సీ సరుకు కూడా అమ్ముడవుతుందని రైతుల్లో నమ్మకం.

ఏడాదంతా అమ్మకాలు
తొలిసారిగా ఏడాది పొడవునా చీనీ మార్కెట్ నిర్వహించారు. ఈ ఏడాది రెండు మూడు నెలలు మినహా మిగతా నెలల్లో మంచి ధరలు పలుకుతుండటంతో రైతులకు గిట్టుబాటవుతోంది. ఈ ఏడాది రూ.185 కోట్ల విలువ చేసే 90 వేల టన్నులకు పైగా చీనీ క్రయవిక్రయాలు జరిగినట్లు నివేదిక వెల్లడిస్తోంది. దీని వల్ల మార్కెట్‌యార్డుకు రూ.1.85 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. టన్ను ధర రూ.25 వేల నుంచి రూ.45 వేల వరకు పలికింది. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు అమ్మకాల జోరు కొనసాగింది. చీనీ మార్కెట్‌ను మరింత విస్తరించాలనే ఆలోచనతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.3 కోట్ల వరకు ఆధునిక పద్ధతిలో మరో ఓపెన్ షెడ్డుతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు.

బ్రహ్మ మురారి సురార్చిత లింగం..



అనంతపురం మొదటి రోడ్డు శివాలయంలో దర్శనం కోసం భక్తుల క్యూ



మొదటిరోడ్డులో శివలింగానికి అభిషేకం

శివభక్తులకు అత్యంత పర్వదినం మహాశివరాత్రి. జిల్లా అంతటా శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునే స్నానాలాచరించి, పూజలు చేసి, ఉపవాసం ఉండి రాత్రి అంతా జాగరణ చేశారు. శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రంతా శివ పూజలు, అభిషేకాలు, అర్చనలు, శివలీలా కథాపారాయణంతో భక్తులు పరవశులయ్యారు.

\- సాక్షి బృందం





అలంకరణలో తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరుడు, పామిడి భోగేశ్వరస్వామి, కంబదూరు మల్లేశ్వరస్వామి



అనంతపురం రాణినగర్‌లో శివలింగానికి పూజలు

తమ్ముడూ ..నేనూ నీవెంటే!

రాఖీ పండుగ వస్తేనే అక్కచెల్లెళ్లు గుర్తుకు వచ్చే సోదరులుండొచ్చు. మొక్కుబడిగా చేతికి దారం కట్టించుకొని ఆశీర్వదించే బంధాలూ ఉండొచ్చు. ఆమె తోడపుట్టిన తమ్ముడికి అన్నీ తానైంది.. తల్లిలా చూసుకుంది. తమ్ముడికి పెళ్లై సమీపంలో మరో ఇంట్లో వేరుగా ఉంటున్నా..వారి మధ్య అదే అనురాగం కొనసాగింది. ఇంటికి వచ్చిన తమ్ముడు కాసేపు మాట్లాడి తిరిగి నడిచి వెళ్తుండగా.. ఫర్లాంగు వెళ్లాడోలేదో..అంతలోనే పిడుగులాంటి వార్త చెవిన పడింది. ఉన్నపళంగా తమ్ముడు కుప్పకూలాడని తెలిసి గుండెపగిలినంత పనైంది. పరుగు పరుగున ఘటనాస్థలికి చేరుకుంది. నిశ్చేష్టుడిలా పడి ఉన్న తమ్ముడిని ఒళ్లోకి వాల్చుకుంది. చేతుల్లోనే ఊపిరి వదిలాడని తెలుసుకొని బోరున విలపించింది. తమ్ముడిని భౌతికంగా ఇక చూడలేననుకుంది. 24 గంటలు గడవనేలేదు.. తమ్ముడూ...నేనూ నీ వెంటేనంటూ ఆ సోదరి కూడా శ్వాస వదిలింది. ఈ హృదయ విదారక ఘటన విద్యారణ్య నగర్‌లో జరిగింది.

- విద్యారణ్యనగర్‌లో విషాదం
- 24 గంటల వ్యవధిలో తమ్ముడు, అక్క మృతి




అక్కాతమ్ముడు మాధవి,తిప్పేస్వామి(ఫైల్)

రాప్తాడు రూరల్: తమ్ముడి మరణం ఆ అక్కను కలచివేసింది. తమ్ముడిని తలచుకుంటూ అక్క కూడా ప్రాణం కోల్పోయింది. ఒక రోజు వ్యవధిలోనే ఇద్దరి మరణం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. వివరాల్లోకెళ్తే.. అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌కు చెందిన వీరభద్రయ్య, మాధవి (46) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. మాధవి తమ్ముడు తిప్పేస్వామి (44) సమీపంలోని గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. తిప్పేస్వామి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం విద్యారణ్యనగర్‌లోని అక్క మాధవి ఇంటికి వెళ్లాడు. అక్కతో కాసేపు మాట్లాడి తన ఇంటికి నడుచుకుంటూ బయల్దేరాడు. కొన్త దూరం నడవగానే గుండె పట్టుకుని కుప్పకూలి పడిపోయాడు. ప్రత్యక్ష సాక్షులు మాధవికి సమాచారం అందించారు. ఆమె పరుగెత్తుకుంటూ వచ్చి తమ్ముడిని తన పొత్తిళ్లలో పెట్టుకుని బోరున విలపించింది. అప్పటికే తిప్పేస్వామిలో ఎలాంటి చలనమూ లేదు. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తిప్పేస్వామి సొంతూరు కుందుర్పి మండలం ఎనుమలదొడ్డిలో సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియల్లో పాల్గొన్న మాధవి ఆరోజు రాత్రి అక్కడే ఉంది. శనివారం ఉదయం ఆమె శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో హుటాహుటిన కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో మృత్యువాత పడింది. తమ్ముడి విషాదాన్ని మరవకముందే ఆ ఇంట మరో విషాదం చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం




మృతిచెందిన కుమ్మర నారాయణమ్మ, వాయల నారాయణమ్మ

పెద్దపప్పూరు: దైవ దర్శనానికి వస్తున్న ఇద్దరు మహిళలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి గ్రామానికి చెందిన కుమ్మర నారాయణమ్మ (80) అనంతపురం జిల్లా గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన వాయల నారాయణమ్మ (50), ఆమె కూతురు భారతి, పామిడి మండలానికి చెందిన రామప్ప, లక్ష్మమ్మలు శనివారం మధ్యాహ్నం పెద్దపప్పూరులోని అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో భీమలింగేశ్వరున్ని దర్శించుకుని, రాత్రికి అక్కడే జాగారం చేయాలని ఆటోలో బయల్దేరారు. పసలూరు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న నీళ్ల ఆటో వీరి ఆటోను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమ్మర నారాయణమ్మ, వాయల నారాయణమ్మ మృతి చెందారు. గాయపడిన భారతి, రామప్ప, లక్ష్మమ్మను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేశాక అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

అనంతపురం: ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. మార్చి 7 వరకు జరగనున్నాయి. మార్చి 15 నుంచి 60 కేంద్రాల్లో థియరీ పరీక్షలు మొదలవుతాయి. జిల్లాలో మొత్తం 41,186 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఐఓ డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు.

ప్రిలిమినరీ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఎస్‌ఐ ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించే ప్రిలిమినరీ రాత పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని తన చాంబర్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి ఒరిజినల్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అనంతపురం, పరిసర ప్రాంతాల్లో మొత్తం 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 13,423 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలు, ఆవరణలు, సమీప ప్రాంతాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఎస్‌ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్ష ఉంటుందన్నారు. గంట ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. నిర్దేశించిన సమయం కన్నా ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలకు పంపరాదన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్, వాచ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ లాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా పర్యవేక్షించాలన్నారు. జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సుజాత, అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, డీఎస్పీలు ప్రసాదరెడ్డి, ఎస్.మహబూబ్ బాషా, సి.ఎం.గంగయ్య, శ్రీనివాసులు (ఏఆర్) తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

10 తులాల బంగారు నగల అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని జేఎన్‌టీయూ సమీపంలో నివాసముంటున్న స్టాఫ్ నర్సు లక్ష్మి హ్యాండ్ బ్యాగ్ నుంచి పది తులాల బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న ఆమె ఇటీవల అదే ప్రాంతంలో జరిగిన ఓ వేడుకలో పాల్గొనేందుకు బంగారు నగలు తీసుకెళ్లారు. గురువారం ఇంటికి చేరుకున్న ఆమె... శనివారం దుస్తులు సర్దుతుండగా బ్యాగ్‌లో ఉన్న నగలు కనిపించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, నగల అదృశ్యంపై స్పష్టత లేకపోవడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

కళ్యాణదుర్గం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నాయకులపై కేసు నమోదైంది. 30 పోలీస్ యాక్ట్, ఎమ్మెల్సీ కోడ్ ఉల్లంఘిస్తూ శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ సర్కిల్‌లో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. అంతటితో ఆగకుండా పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడుతో పాటు 16 మందిపై శనివారం ఉదయం కేసు నమోదు చేసినట్లు సీఐ తేజమూర్తి తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు

ఉరవకొండ: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ఉరవకొండలోని పోలీసు క్రీడామైదానంలో ప్రారంభం కానున్నాయి. ఏపీ రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21 వరకు పోటీలు జరుగుతాయి. అండర్ - 14, అండర్- 17 విభాగాల్లో పోటీలు ఉంటాయని ఎంఈఓ ఈశ్వరప్ప, సెపక్‌తక్రా క్రీడా సంఘం కార్యదర్శి మారుతీ ప్రసాద్ తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రాత్రిపూట ఫ్లడ్‌లైట్ల వెలుగులోనూ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించామని తెలిపారు.

దళారీ... పరారీ!



- పంట కొనుకుని రైతులకు డబ్బివ్వకుండా ఉడాయించిన శ్రీకాంత్ చౌదరి
- దుప్పటి పంచాయితీతో సరిపెట్టిన రామగిరి పోలీసులు
- కమీషన్ కక్కుర్తితో రైతులకు అన్యాయం చేసేందుకు సిద్ధమైన ఖాకీ
- రూ.35 లక్షలకు గాను రూ.4 లక్షలే ఇస్తాడని హుకుం జారీ
- గడువు ఇచ్చి తప్పించిన వైనం
- రోజుల తరబడి చీటర్ కోసం గాలించిన రైతులు
- ఎట్టకేలకు పట్టుకుని 'అనంత' పోలీసులకు అప్పగింత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంటను దళారీ అప్పనంగా ఎత్తుకెళ్లాడు. ఓ ధర నిర్ణయించి డబ్బు ఇవ్వకుండా ముఖం చాటేశాడు. రోజులు.. నెలలు గడిచాయి. న్యాయం చేయాలంటూ దళారీని శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులకు అప్పగిస్తే కాసులకు కక్కుర్తితో ఓ ఖాకీ అన్యాయం చేసేందుకు సిద్ధపడ్డాడు. రూ.35 లక్షలకు గాను రూ.4 లక్షలకే చెల్లిస్తాడని ఏకపక్ష తీర్పు జారీ చేస్తే ఆ మొత్తం కూడా ఇవ్వకుండా దళారీ అజ్ఞాతంలోకి జారుకున్నాడు. ఈ క్రమంలో మరి కొందరు రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుండగా బాధితులు పట్టుకుని 'అనంత' పోలీసులకు అప్పగించారు.

ఎవరీ చీటర్?



శ్రీకాంత్ చౌదరి

శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఎగువపల్లికి చెందిన శ్రీకాంత్ చౌదరి... దళారీగా అవతారమెత్తి రైతుల నుంచి పంట కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. పంట కొనుగోలు సమయంలో కొంత మేర ధర నిర్ణయించేవాడు. పంట కోత కోసిన తర్వాత తన వద్ద డబ్బు లేదని, పంట విక్రయించి తెచ్చిస్తానని నమ్మబలికేవాడు. తన మాటల గారడీతో రైతులను నమ్మించి పంట తీసుకెళ్లి డబ్బు ఇవ్వకుండా ముఖం చాటేసేవాడు.

ఏం జరిగింది?

అనంతపురం జిల్లా నార్పలకు చెందిన రాగే పరుశురాం... రైతుల తోటల్లోని ఫలసాయాన్ని కొనుగోలు చేసి దళారులకు విక్రయించగా వచ్చిన లాభంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రామగిరి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ద్వారా పరుశురాంకు శ్రీకాంత్ చౌదరి పరిచయమయ్యాడు. కొన్ని నెలల క్రితం కళ్యాణదుర్గం, గార్లదిన్నె, రాప్తాడు మండలాల్లో చీనీ ఫలసాయాన్ని వ్యాపారి పరుశురాం కొనుగోలు చేశాడు. తనకు అనారోగ్యంగా ఉండడంతో వెళ్లలేని పరిస్థితుల్లో పంటను దళారీ శ్రీకాంత్ చౌదరికి అప్పగించాడు. మూడు ప్రాంతాల్లోని తోటల్లో చీనీ కాయలు కోసి దిగుబడిని లారీలకు ఎక్కించిన తర్వాత పంట విక్రయించి డబ్బు చెల్లిస్తానని చౌదరి పేర్కొన్నాడు. ఈ విషయాన్ని ముందే ఎందుకు చెప్పలేదని రైతులు పేర్కొనడంతో రెండు రోజుల గడువు కోరి పంట తరలించాడు.

రామగిరి పోలీసులకు ఫిర్యాదు

రెండు రోజుల్లో డబ్బు చెల్లిస్తానన్న శ్రీకాంత్ తన మాట నిలబెట్టుకోలేకపోవడంతో రైతులు అతని సెల్‌ఫోన్‌కు కాల్ చేశారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో చివరకు విషయాన్ని వ్యాపారి పరుశురాం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులను కలుపుకుని పరుశురాం గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో చివరకు తనకు పరిచయం చేసిన కానిస్టేబుల్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి గట్టిగా నిలదీశాడు. కానిస్టేబుల్ సూచనతో శ్రీకాంత్ చౌదరిపై రామగిరి ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

ఇచ్చేది అంతే!

రైతులు, వ్యాపారి ఫిర్యాదును పరిశీలించిన రామగిరి ఎస్‌ఐ జనార్ధన నాయుడు అది తన పరిధి కాదని తొలుత దాటేశాడు. అనంతరం శ్రీకాంత్‌ను స్టేషన్‌కు పిలిపించి దుప్పటి పంచాయితీ నిర్వహించాడు. ఈ క్రమంలో అతని మాటల గారడీలో చిక్కుకున్న ఎస్‌ఐ.. తన వాటా సొమ్ము కోసం రైతులకు అన్యాయం చేసేందుకు సిద్ధపడ్డాడు. రైతులకు చెల్లించాల్సిన రూ.35 లక్షలకు గాను రూ.4 లక్షలే ఇస్తాడని తేల్చి చెప్పాడు. రైతులు కాదూ.. కూడదని భీష్మించుకుంటే ఆ డబ్బు కూడా ఇవ్వకపోతే ఏం చేస్తారంటూ బెదిరింపులకు దిగాడు. రెండు రోజుల్లోపు డబ్బు చెల్లిస్తాడని అప్పటి వరకూ అతణ్ని ఎవరూ అడగరాదని హుకుం జారీ చేశాడు. ఈలోపు శ్రీకాంత్‌ని అక్కడి నుంచి తప్పించేశాడు.

మోసం చేయబోతుండగా..

రామగిరి పోలీస్ స్టేషన్ నుంచి దర్జాగా తప్పించుకున్న దళారీ శ్రీకాంత్ చౌదరి.. తిరిగి రైతులకు కనిపించకుండా వెళ్లిపోయాడు. దీంతో రైతులతో పాటు వ్యాపారి రాగే పరుశురాంలో పట్టుదల పెరిగి అతని కోసం జల్లెడ పట్టసాగారు. ఈ క్రమంలో శనివారం ఉదయం అనంతపురంలోని పాతూరు మార్కెట్ ప్రాంతంలో కొందరు రైతులతో పంట కొనుగోలు విషయమై ఒప్పందం చేసుకుంటున్న శ్రీకాంత్ చౌదరిని పరుశురాం గమనించి పట్టుకుని, నేరుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు. జరిగిన మోసాన్ని సీఐ రవిశంకరరెడ్డికి వివరించి, రైతులకు న్యాయం చేయాలని అభ్యర్థించాడు. ఆ సమయంలో రూ. 4 లక్షలకు మించి ఎక్కువ ఇవ్వలేనని శ్రీకాంత్ తెగేసి చెప్పాడు. దీనిపై సీఐ రవిశంకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుల సొమ్ము తిరిగి ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితుడిని అదుపులో ఉంచుకుని ఎంత మంది రైతులను మోసం చేసిన అంశంపై విచారణ చేస్తున్నారు. కాగా, శ్రీకాంత్ చౌదరిపై కర్ణాటకలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలో సోలార్ ప్లాంట్ కాంట్రాక్టర్‌ను బెదిరించి, డబ్బు వసూలు చేసిన ఘటనపై అప్పట్లో కేసు నమోదైంది.

సీటు కోసం పాట్లు



బస్సును చుట్టుముట్టిన ప్రయాణికులు

అనంతపురం క్రైం: శివరాత్రి పర్వదినాన అనంతపురం బస్టాండ్ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు ప్రయాణికులు చేరుకోవడంతో కనీసం నిలబడేందుకు కూడా చోటు లేకుండా పోయింది. బస్సులు వస్తే సీటు కోసం పరుగులు పెడుతుండడంతో ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నారు.

టీడీపీ నాయకుల ర్యాలీ

ఉరవకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ధిక్కరిస్తూ ఉరవకొండలో టీడీపీ నాయకులు శనివారం ర్యాలీ చేపట్టారు. దీనిపై ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం విమర్శలకు తావిచ్చింది.

యువకుడి దుర్మరణం



మనోజ్ (ఫైల్)

బెళుగుప్ప: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన మనోజ్ (21) తన ద్విచక్ర వాహనానికి సంబంధించి రుణ కంతు చెల్లించేందుకు శనివారం ఉదయం కళ్యాణదుర్గానికి బయలుదేరాడు. బెళుగుప్ప మండలం గుండ్లపల్లి - రామినేపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన స్కార్పియో ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన మనోజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నగదు అపహరణ

గార్లదిన్నె: లారీలో నిద్రిస్తున్న డ్రైవర్ జేబులో నుంచి రూ.36 వేలను గుర్తు తెలియని యువకులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన సేక్ మునీర్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం కంది పప్పు లోడు తీసుకుని అనంతపురానికి వచ్చిన అతను సరుకు అన్‌లోడ్ చేసిన తర్వాత రూ.36 వేలు నగదు తీసుకుని ఆదివారం రాత్రి మాచర్లకు బయలుదేరాడు. ఇంతలో లారీ యజమాని ఫోన్ చేసి పామిడిలో సరుకు లోడు చేసుకుని రావాలని తెలపడంతో కల్లూరులోని 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద భోజనం చేసుకుని అక్కడే లారీలో క్లీనర్ లింగమయ్యతో కలసి నిద్రపోయారు. శనివారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు మునీర్ ప్యాంట్ జేబులో నుంచి డబ్బు తీస్తుండగా నిద్ర మేల్కొన్న క్లీనర్ గట్టిగా కేకలు వేశాడు. మునీర్ అప్రమత్తమయ్యే లోపు నగదు తీసుకుని ద్విచక్ర వాహనంపై యువకులు ఉడాయించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన హైకోర్టు న్యాయమూర్తి



విద్యార్థులతో సమావేశమైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్

అనంతపురం: నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న బీసీ, ఎస్సీ హాస్టళ్లను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్ శనివారం తనిఖీ చేశారు. జిల్లా కోర్టులో ఆదివారం నిర్వహించనున్న జిల్లా స్థాయి న్యాయ సమీక్షలో పాల్గొనేందుకు శనివారం అనంతపురానికి చేరుకున్న న్యాయమూర్తిని అనంతపురం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.శ్రీనివాసులు, అడిషనల్ జిల్లా జడ్జి ఎస్.రమేష్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీనబాబు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం హాస్టళ్లను న్యాయమూర్తి సందర్శించి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హాస్టళ్లలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

అరుదైన జాగారం



కళ్యాణదుర్గం భవానీ శంకరాలయంలో హిందువుల జాగరణ



టీ సర్కిల్ మసీదులో జాగారం చేస్తున్న ముస్లింలు

కళ్యాణదుర్గం: హిందువులు, ముస్లింలు జాగారం చేసిన అరుదైన రోజు ఇది. కళ్యాణదుర్గంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని హిందువులు శనివారం రాత్రి ఇళ్లు, ఆలయాల్లో జాగారం చేశారు. ఈ రోజు జాగారం చేస్తే ఎన్నో జన్మల పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఇక ముస్లింలు షబ్-ఎ-మేరాజ్ ముబారక్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఇదే రోజు రాత్రంతా మసీదుల్లో జాగరణ చేసి.. నమాజ్ చేశారు. మహమ్మద్ ప్రవక్త అల్లాను కలవడానికి ఎలా వెళ్లాడు.. వారి ప్రయాణం ఎలా జరిగింది.. వారి మధ్య సంభాషణ వంటి విషయాలను మత పెద్దలు వివరించారు. ఒకేరోజు హిందూ, ముస్లింలు జాగారం చేయడం ఎంతో శుభ సూచకమని పలువురు పేర్కొన్నారు.

తుది పోరుకు 'అనంత', విజయవాడ



తలపడుతున్న విజయవాడ, హైదరాబాద్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెటరన్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌కు విజయవాడ, అనంతపురం జట్లు చేరుకున్నాయి. అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన మైదానంతో పాటు, మరో మైదానంలో శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, గుంటూరు, వైఎస్సార్, విజయవాడ, నెల్లూరు, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి.

మ్యాచ్‌ల వివరాలు ఇలా...

- వైఎస్సార్ జిల్లా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జిల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. వైఎస్సార్ జిల్లా బౌలర్లలో సంజయ్‌రెడ్డి 3, ఫయాజ్, వెంకటరమణ చెరో 2 వికెట్లు, భరత్‌రెడ్డి ఒక వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైఎస్సార్ జిల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 135 పరుగులకే పరిమితమైంది. 15 పరుగుల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించింది.
- విజయవాడ, నెల్లూరు జిల్లాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసింది. జట్టులో రాజకృష్ణ 63 పరుగులతో రాణించాడు. విజయవాడ బౌలర్లలో శ్రీకాంత్ 4 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 17.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ప్రసాద్ 36, జ్వాల చౌదరి 60, లెనిన్ 24 పరుగులతో అలరించారు.
- గుంటూరు జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. జట్టులో ప్రదీప్ 77, విశ్వనాథ్ 22, హరినాథ్‌రెడ్డి 18 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 140 పరుగులకే పరిమితమైంది. అనంతపురం బౌలర్లలో షాబుద్దీన్, ప్రదీప్, యుగంధర్, గులాం చెరో వికెట్‌ను సాధించారు. 11 పరుగులతో అనంతపురం జట్టు విజయం సాధించింది.
- హైదరాబాద్ జట్టుపై తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. జట్టులో ప్రసాద్ 43, జనార్ధన్ 45 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. జట్టులో శేషగిరి 50, సుబ్బు 57 పరుగులతో రాణించారు. దీంతో మ్యాచ్ టైగా ముగిసింది.

బావిలో పడి చిన్నారి మృతి



పరమేష్ (ఫైల్)

పుట్టపర్తి టౌన్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ చిన్నారి మృతి చెందాడు. వివరాలు.. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన సాయిలీల, మహేష్ దంపతులకు నాలుగేళ్ల వయసున్న కుమారుడు పరమేష్ ఉన్నాడు. వీరి ఇంటి సమీపంలోనే పాడుబడ్డ పురాతన బావి ఉంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి ఎదుట పరమేష్ ఆడుకుంటుండడంతో తల్లి ఇంట్లో పనిలో నిమగ్నమైంది. ఆ సమయంలో ఆడుకుంటూ బావి వద్దకు వెళ్లిన పరమేష్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కాసేపటి తర్వాత తల్లి బయటకు వచ్చి చూడగా పరమేష్ కనిపించలేదు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో అందరూ కలసి గాలింపు చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు బావిలో పరమేష్ మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు.

కారు ఢీకొని రైతు..



మృతుడు గోవిందరెడ్డి

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లిక్రాస్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో రైతు గోవిందరెడ్డి (65) దుర్మరణం పాలయ్యాడు. కనగానపల్లి మండలం కొండ్రెడ్డిబావికి చెందిన గోవిందరెడ్డి పాడి పశువులు మేపుతో జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీ దినచర్యలో భాగంగా సీతారాంపల్లి వద్ద ఉన్న ఓ హోటల్‌లో శనివారం సాయంత్రం పాలు పోసి గ్రామానికి నడుచుకుంటూ వెళుతుండగా బెంగళూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో గోవిందరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. మృతుడికి భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుత్తి ఫోర్టు స్టేషన్‌కు చేరుకున్న తొలి రైలు



సన్మానం అందుకున్న రైల్వే అధికారులు

గుత్తి: స్థానిక కర్నూలు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్ (బైపాస్)కు శనివారం ఉదయం 8.30 గంటలకు విజయవాడ నుంచి ధర్మవరానికి వెళుతున్న రైలు చేరుకుంది. గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. రైలులో వచ్చిన అధికారులను సన్మానించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడుర చౌదరి విజయభాస్కర్ మాట్లాడుతూ.. నూతన రైల్వేస్టేషన్‌కు గుత్తి ఫోర్టుగా నామకరణం చేసేందుకు కృషి చేసిన గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి, ఎంపీ రంగయ్య, రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు సూర్యనారాయణ రెడ్డి, కోట గైడ్ రమేష్, గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు చిరంజీవి, వెంకట్రామిరెడ్డి, విజయ్, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా హనుమాన్ శోభాయాత్ర



27 అడుగుల ఎత్తున్న ఏకశిల హనుమాన్ విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం



చిన్న మార్కెట్‌లో సాగిపోతున్న శోభాయాత్ర

హిందూపురం: స్థానిక బైలాంజనేయ స్వామి గుడి వద్ద ప్రతిష్ఠించేందుకు కుప్పంలో సిద్ధం చేయించి తీసుకువచ్చిన 27 అడుగుల ఏకశిల హనుమాన్ విగ్రహం శనివారం హిందూపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర అట్టహాసంగా సాగింది. శనివారం ఉదయం సూగూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్న విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 'జై శ్రీరాం.. జై భజరంగ భళి' అంటూ వేలాది మంది నినదిస్తుండగా బెంగళూరు రోడ్డు, చిన్న మార్కెట్, మెయిన్ బజారు, గాంధీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, పెనుకొండ రోడ్డు, దండు రోడ్డు మీదుగా బైలాంజినేయస్వామి ఆలయానికి చేర్చారు. శోభాయాత్రలో వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి, కౌన్సిలర్ శివతోపాటు పట్టణ ప్రముఖులు, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరులో శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , తోపుదుర్తి బ్రదర్స్ ఆర్థిక సహకారంతో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. రాతిదూలం లాగుడు పోటీల్లో మెదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

ఆదమరచి అడుగేస్తే ప్రమాదమే



రోడ్డు మధ్యన ఏర్పడిన గోతి

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చంద్రబాబునగర్‌లో రోడ్డు మధ్యలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. డ్రైనేజీల కోసం ఏర్పాటు చేసిన పైప్‌లు పగిలిపోయి రోడ్డు మధ్యలో గోతులు పడటంతో ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో గోతులు కనిపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పున్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: శారదా సపారె చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు అధినేత రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. 40 రోజుల పాటు సాగే ఉచిత శిక్షణను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నామినేషన్ దాఖలుకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు డీఎస్పీ జి. ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం డీఎస్పీ తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్ల దాఖలులో నిబంధనలు పాటించాలన్నారు. అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ పోటీ అభ్యర్థులు స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో దాఖలు చేస్తున్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి, నలుగురు ప్రపోజర్లు కలిపి మొత్తం ఐదుగురికి, 3 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. మిగతా వారి వాహనాలకు అనుమతి ఉండదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండడంతో ర్యాలీలు, సభలు, సమావేశాలు నిషేధమన్నారు.

ఘనంగా షబ్ ఏ మేరాజ్



విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన ఈద్గా మసీదు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వ్యాప్తంగా షబ్ ఏ మేరాజ్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి ప్రత్యేక నమాజును నిర్వహించి మహమ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలని మౌల్వీలు ప్రబోధించారు. మసీదులను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో నగర మేయర్ మహమ్మద్ వసీం , రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

దైవ ప్రసన్నం కోసమే ఉమ్రా యాత్ర



జిల్లా నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: దైవ ప్రసన్నం కోసమే ఉమ్రా యాత్ర అని ముస్లిం మత పెద్దలు స్పష్టం చేశారు. నగరంలోని సంగమేశ్వర సర్కిల్ నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారికి వీడ్కోలు కార్యక్రమాన్ని అల్ అహద్ ఇంటర్నేషనల్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మక్కా, మదీన ప్రాంతాల్లో యాత్రలో శుభప్రదంగా విజయవంతం కావాలని కోరారు. హజ్, ఉమ్రా యాత్రల ద్వారా దైవ ప్రసన్నత లభిస్తుందన్నారు. జిల్లా నుంచి మొత్తం 56 మంది ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో హాజీ అహమ్మద్ హుస్సేన్, హాజీ రహంతుల్లా, ఎస్ఎం బాషా, రజాక్, మొయిన్ పాల్గొన్నారు.

నగరం.. శివసాగరం

- మహాశివరాత్రి రోజున శనిత్రయోదశి కలిసి రావడంతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- కమనీయంగా ఆది దంపతుల కల్యాణోత్సవాలు

అనంతపురం కల్చరల్: మహా శివరాత్రి పర్వదినాన శనిత్రయోదశి కలిసి రావడంతో నగరం శివ సాగరాన్ని తలపించింది. నగరంలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. సర్వాంగ శోభితుడైన మహేశ్వరుడు పార్వతీమాతతో కలసి నగరపుర వీధుల్లో ఊరేగి, భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. తెల్లవారుజామున నుంచే శివయాల్లో దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రం, చమకం పఠనం, మారేడు బిళ్వ దళార్చన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. 'హర హర మహాదేవ.. శంభో శంకర' అంటూ శివ నామస్మరణతో రాత్రంతా ఆలయ పరిసరాలు మార్మోగాయి.

కనుల పండువగా కల్యాణోత్సవం:



పంపనూరులో ఉత్సవ విగ్రహాలను ప్రదక్షిణలు చేయిస్తున్న అర్చకులు



తపోవనంలో కల్యాణోత్సవం



శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరుల వైభవం



మూడో రోడ్డులో శివపార్వతుల కల్యాణోత్సవం



మొదటిరోడ్డు శివాలయంలో బారులుదీరిన భక్తులు

స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో శివరాత్రి పండుగ జన జాతరగా మారింది. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమం, శారదా శృంగేరి శంకరమఠం, శివకోటిలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం, అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీకాలనీలోని అన్నపూర్ణా మంజునాథేశ్వరాలయం, జెడ్పీరోడ్డులోని గీతామందిరంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. తపోవనం శ్రీశివశక్తి బాబా ఆలయంలో సాయిట్రస్టు నేతృత్వంలో కల్యాణోత్సవం, అభిషేకాలు, పదకొండు రకాల పండ్ల రసాలతో, 27 రకాల వస్తువులతో శివుడికి పూజలు నిర్వహించారు.

మార్మోగిన శివనామస్మరణ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో శనివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంజునాథ స్వామికి తెల్లవారుజామున గణపతి పూజ, స్వస్తి వాచనం, రక్షాబంధం, గోపూజ తదితర పూజలు చేశారు. ఏకాదశి రుద్రాభిషేకం, సాయంత్రం మంజునాథ కల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలోని శివుడి, భైరవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో శివనామస్మరణ

రాప్తాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మండల వ్యాప్తంగా రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి ఆలయం, రామేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, పండమేటి రాయుడు, ఇటుకులపల్లయ్యస్వామి, మారెమ్మ, పెద్దమ్మ, మరిగమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివుడికి గురుస్వామి గవ్వల మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కనగానపల్లి: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని కనగానపల్లి, తగరకుంట, ముక్తాపురం, పర్వత దేవరపల్లి శివాలయాల వద్ద తెల్లవారుజామున నుంచే భక్తులు శివలింగాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కనగానపల్లి సమీపంలోని అతకల్లపట్నం మల్లేశ్వర ఆలయంలో జరిగిన పూజలు, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముక్తాపురం ముక్తీశ్వరాలయం, పర్వతదేవరపల్లి, తగరకుంటలో మల్లికార్జున ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల సందడి నెలకొంది. జాగరణకు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



టీటీడీ కల్యాణ మంటపంలో శివలింగం



శివకోటిలో పార్వతీపరమేశ్వరులు



రాణినగర్ ఆలయంలో ఏర్పాటు చేసిన శివుడు



ప్రసాదం పంపిణీ చేస్తున్న దాతలు



టీటీడీ కళ్యాణ మంటపంలో మరకత శివలింగాలు



నాగులకట్టకు మొక్కుతున్న వృద్ధురాలు



మొదటిరోడ్డు శివాలయంలో బాలికల నృత్యం



పూజలు చేస్తున్న భక్తులు



రాణినగర్‌లోని నాగలకట్టకు పూజలు చేస్తున్న మహిళలు



గొంగటి రామప్ప కల్యాణమంటపంలో ఏర్పాటు చేసిన శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు





కోలాటాలాడుతున్న మహిళలు , మొదటి రోడ్డు శివాలయంలో శివపార్వతులు

కమనీయం..శివపార్వతుల కల్యాణం

- వినూత్నంగా సాగిన పురాణ ప్రశ్నోత్తరాలు
- భక్తిభావం నింపిన బ్రహ్మకుమారీ శాంతియాత్ర

అనంతపురం కల్చరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలు వేదికగా అనంత శివారాధన సమితి నేతృత్వంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. టీటీడీ ధర్మప్రచార మండలి శ్రీపాద వేణు నేతృత్వంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శివరాత్రి జాగరణ మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. పాలసముద్రం నాగరాజు బృందం భక్తి విభావరి, భజన సంఘాలు శివనామస్మరణతో మార్మోగించారు. పలుచోట్ల శాస్త్రీయ నృత్యాలతో చిన్నారులు మహాశివుడికి నృత్యనీరాజనాలర్పించారు. స్థానిక మొదటిరోడ్డు శివాలయంలో పట్నం శివప్రసాద్ శిష్యబృందం, శారదామఠంలో నాటాచార్యులు సురేష్ మాస్టర్ శిష్యబృందాలు కూచిపూడి నాట్యాలు ప్రత్యేక శోభను తెచ్చాయి.

భక్తిభావం నింపిన శాంతియాత్ర:

ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం 87వ త్రిమూర్తి శివ జయంతి వేడుకలు కనులపండువగా సాగాయి. శనివారం సాయంత్రం నుంచి రాత్రి జ్యోతిర్లింగాల శాంతి యాత్ర నేత్రపర్వంగా సాగింది. పలు వీధులు దాటుతూ పాతూరులో ఏర్పాటు చేసిన శ్రీచెన్న కేశవస్వామి ఆలయం వరకు శివనామస్మరణ నడుమ పండుగ వాతావరణంలో నగరోత్సవం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి సిస్టర్ శారద మహాశివుని ప్రత్యేకత విశిష్టతను తెలియజేశారు.

అధికారం కోసం తండ్రీ కొడుకుల పాకులాట

- మాజీ సీఎం చంద్రబాబు, లోకేష్‌లపై మేయర్ వసీం ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అధికారం దక్కించుకోవాలని తండ్రీ కొడుకులు పాకులాడుతున్నారని మాజీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌పై మేయర్ వసీం ధ్వజమెత్తారు. శనివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనపర్తిలో పోలీసులపై మాజీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వాఖ్యలను ఆయన ఖండించారు. టీడీపీ చేపడుతున్న కార్యక్రమాలు, లోకేష్ పాదయాత్రను పోలీసుల ద్వారా ప్రభుత్వం అడ్డుకుంటోందని మాజీ సీఎం చేసిన వాఖ్యలను మేయర్ తప్పుబట్టారు. ఇటీవల మాజీ సీఎం కార్యక్రమాల్లో కొందరు మరణించారని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటుంటే పోలీసులు కూడా సంఘవిద్రోహుల్లా మారారని మాట్లాడడం సరికాదన్నారు. తాము అధికారంలోకొచ్చాక జైలుకు పంపుతామని హెచ్చరించడం దారుణమన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తండ్రీకొడుకులు రాజకీయాలు చేస్తున్నారన్నారు. వాస్తవంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలుచుకుంటే సభలు, పాదయాత్రలు చేసేవారానని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. అభివృద్ధిపైనే సీఎంకు ధ్యాస అని అన్నారు. ప్రజలకు ఏం మేలు చేయాలన్నా..దానికి అడ్డుతగలడం మినహా టీడీపీ చేస్తోందేమీ లేదన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేశానని చెప్పుకొచ్చే ఆయన.. రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రజలు ప్రతి ఒక్కటీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాతిదూలం పోటీలు

పామిడి: మండలంలోని పెన్నప్పగుడి వద్ద ఎరిత్రాత, పక్కీరప్ప సాముల 22వ రథోత్సవంలో భాగంగా వంకరాజుకాలువ, నెమళ్ళపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు శనివారం ముగిసాయి. చివరిరోజు ఆరుపళ్ల విభాగం పోటీలు హోరాహోరీగా సాగాయి.

జిల్లా స్థాయి అండర్-7 చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లుటౌన్: ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెంగ్విన్ యాక్టివిటీ క్లబ్ వేదికగా గుంతకల్లులో శనివారం జరిగిన జిల్లా స్థాయి అండర్-7 బాలబాలికల ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో గుంతకల్లు, గుత్తి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు రౌండ్‌లు నిర్వహించగా బాలుర విభాగంలో గుంతకల్లుకు చెందిన సిబి.సూర్యతేజస్ రెడ్డి చాంపియన్‌గానూ, గుత్తికి చెందిన లక్ష్మీనరసింహ రన్నర్‌గానూ, గుంతకల్లుకు చెందిన మహ్మద్ ఉమర్‌షేక్ తృతీయస్థానంలో నిలిచారన్నారు. బాలికల విభాగంలో అనంతపురానికి చెందిన ఉమ్మె ఐమాన్‌షేక్ చాంపియన్‌గానూ, గుంతకల్లుకు చెందిన విస్వాని అరవ రన్నర్‌గానూ, అనంతపురానికి చెందిన కాశి సమిక తృతీయస్థానంలో నిలిచినట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు టోర్నీ డైరెక్టర్ కర్ణాటకం నాగార్జున, కౌన్సిలర్ కృపాకర్, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ భార్గవి, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జునల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

ముగిసిన యుద్ధకళల్లో ప్రత్యేక శిక్షణ





క్రీడాకారులకు శిక్షణను అందిస్తున్న కోచ్ శాంతరాజ్, శిక్షణకు హాజరైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని వీకే భవన్ సమీపంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 20 మంది క్రీడాకారులకు యుద్ధకళల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బాల బాలికలకు యుద్ధకళలు, తైక్వాండో, కరాటే విభాగాల్లో నాలుగు రోజులుగా నాల్గో డాన్ బ్లాక్ బెల్ట్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాంతరాజ్ నేతృత్వంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ప్రత్యేకంగా హ్యాండ్ మూమెంట్స్, లెగ్ మూమెంట్స్, స్పారింగ్ విధానాలలో ప్రత్యేకంగా శిక్షణ అందించారు. అన్ని యుద్ధ విద్యల్లో వారిని తీర్చిదిద్ది ప్రధానంగా ఆత్మరక్షణకు అవసరమయ్యే శిక్షణను ప్రత్యేకంగా అందించారు. గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, పెనుకొండకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామచంద్ర, అసిస్టెంట్ కోచ్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గంధం మహోత్సవం

శింగనమల: శింగనమలలో హిందూ-ముస్లింలు కలిసి జరుపుకుంటున్న హాజ్రత్ సయ్యద్ సాలర్ మసూద్ గాజి గంధం మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది.

ఫ్లెక్సీల తొలగింపు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించేలా నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. శనివారం రాజురోడ్డులో పర్యటించిన ఆయన.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎవరూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ధిక్కరించరాదన్నారు.

శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నార్పల: మండల కేంద్రంలో యాదవుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబోయే శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరరావు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి మనుగడకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు శ్రీ కృష్ణ డన్నారు. భగవద్గీత ప్రబోధకునిగా, తత్త్వోపదేశకునిగా, దేవదేవునిగా,రాజనీతిజ్ఞునిగా నిలిచిన శ్రీ కృష్ణుడి ఆలయ నిర్మాణం మండల కేంద్రంలో చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్ యాదవ్, గొల్ల సుధాకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.